

పోడుపట్టాల పంపిణీకి ఏర్పాట్లు

జిల్లాలో అర్హులైన పోడు రైతులకు పట్టాలు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ వీ.పీ.గౌతమ్ వెల్లడించారు. 8లో



101శాతం బొగ్గు ఉత్పత్తి

సింగరేణి పరిధి కొత్తగూడెం ఏరియాలో జనవరి నెలలో 101 శాతం బొగ్గు ఉత్పత్తి నమోదైందని అధికారులు తెలిపారు. 10లో



వాతావరణం

బుధవారం ఉదయం పెద్దగా చలి ప్రభావం ఉండకపోవచ్చు. మధ్యాహ్నం మాత్రం ఉష్ణోగ్రత పెరిగే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

దరఖాస్తు గడువు పొడిగింపు

ఖమ్మంమయూరిసెంటర్: బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యాన గ్రూప్–1 అభ్యర్థులకు ఇవ్వనున్న శిక్షణ కోసం దరఖాస్తు చేసుకునే గడువును 3వ తేదీ వరకు పొడిగించారు. ఈ విషయాన్ని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జి.శ్రీలత తెలిపారు. గ్రూప్–1 ప్రిలిమ్స్‌లో ఎంపికైన వంద మంది అభ్యర్థులకు మూడు నెలల పాటు శిక్షణ ఇస్తామని వెల్లడించారు. శిక్షణ కాలంలో నెలకు రూ.5 వేల స్టైఫండ్‌తో పాటు ఉచితంగా పుస్తకాలు అందజేస్తామని, వివరాల కోసం 08742-227427, 95738 59598 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

టీటీడీ ఆధ్వర్యాన నేడు పోటీలు

ఖమ్మంగాంధీచౌక్: మాఘమాసం భీష్మ ఏకాదశి సందర్భంగా టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యాన బుధవారం శ్లోక కంఠస్థ పోటీలు ఏర్పాటుచేసినట్లు నిర్వాహకులు వి.శ్రీనివాసులు, కర్నాటి రామకృష్ణారెడ్డి తెలిపారు. 10 నుంచి 15 ఏళ్ల లోపు విద్యార్థులకు శ్రీ విష్ణు సహస్ర నామం, పదేళ్ల లోపు విద్యార్థులకు శ్రీ అచ్యుతాష్టకంపై పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఖమ్మంలోని హిందూ ధర్మప్రచార పరిషత్ కార్యాలయంలో ఉదయం పది గంటలకు మొదలయే పోటీలకు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని సూచించారు.

లోక్ అదాలత్ లాభాలను వివరించండి

ఖమ్మంలీగల్: రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకునేందుకు వీలున్న లోక్ అదాలత్ ద్వారా ప్రయోజనాలను కక్షిదారులకు వివరించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అబ్దుల్ జావీద్‌పాషా సూచించారు. ఈనెల 11న లోక్ అదాలత్ జరగనున్న దృష్ట్యా మంగళవారం ఆయన పారా లీగల్ వలంటీర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ పెండింగ్ కేసులతోపాటు ఇప్పటివరకు కోర్టులో దాఖలు చేయని వివాదాలను కూడా ప్రీ లిటిగేషన్ విధానంలో లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

నవోదయ దరఖాస్తు గడువు పెంపు

కూసుమంచి: ఖమ్మం జిల్లా పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయలో 2023–24 విద్యాసంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తు గడువు పొడిగించారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈనెల 8లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ చంద్రబాబు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.


నాణ్యమైన విద్యతోనే విద్యార్థులకు భవిష్యత్



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ

వైరారూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించడం ద్వారా విద్యార్థులకు మంచి భవిష్యత్ లభిస్తుందని డీఈఓ సోమశేఖర శర్మ తెలిపారు. మండలంలోని గొల్లెనపాడు యూపీఎస్‌ను మంగళవారం సందర్శించిన ఆయన మన ఊరు–మన బడిలో భాగంగా చేపట్టిన పనులను పరిశీలించారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ తల్లిదండ్రులకు నమ్మకం పెంచేలా పాఠశాలల్లో వసతులు కల్పిస్తున్న నేపథ్యాన విద్యార్థులకు మెరుగైన బోధన అందించడంపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలని సూచించారు. ఎంఈఓ కొత్తపల్లి వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా సైన్స్ సెంటర్‌కు.. పాత డీఈఓ ఆఫీస్ భవనం



పాత డీఈఓ కార్యాలయానికి ఏర్పాటుచేసిన బోర్డు

ఖమ్మం సహకారనగర్: సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(నూతన కలెక్టరేట్)లోకి డీఈఓ కార్యాలయాన్ని తరలించడంతో ఆ భవనం ఖాళీ అయింది. ఈమేరకు భవనాన్ని జిల్లా సైన్స్ మ్యూజియం, జిల్లా సైన్స్ సెంటర్‌కు కేటాయించారు. దీంతో మంగళవారం కార్యాలయానికి బోర్డు ఏర్పాటుచేసినట్లు జిల్లా సైన్స్ అధికారి బి.సైదులు తెలిపారు.



రంగులతో కళకళలాడుతున్న శాంతినగర్ పాఠశాల భవనం

బడి.. రెడీ!

- 'మన ఊరు–మన బడి'లో పాఠశాలల ముస్తాబు
- ప్రారంభానికి 32 స్కూళ్లు సిద్ధం
- నేడు రెండింటిని ప్రారంభించనున్న మంత్రి పువ్వాడ
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ గౌతమ్

ఖమ్మంసహకారనగర్: మన ఊరు – మన బడి, మన బస్తీ – మన బడి కార్యక్రమం కింద జిల్లాలోని పాఠశాలల రూపురేఖలు మారాయి. రాష్ట్రప్రభుత్వం పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కల్పించి విద్యార్థులకు మెరుగైన విద్య అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా తొలివిడతగా 426 పాఠశాలలను ఎంపిక చేయగా, 32 పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయి. దీంతో నగరంలోని రెండు పాఠశాలలను లాంఛనంగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ బుధవారం ప్రారంభించనున్నారు.

మెరుగైన వసతులు

పాఠశాలల్లో మంచి వాతావరణం కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు–మన బడి, మన బస్తీ–మన బడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా అవసరమైన మరమ్మతులు చేపట్టడమే కాక, మరుగుదొడ్లు, ప్రహరీ నిర్మాణాలు, రంగులు వేయడం, నీటి వసతి తదితర పనులు చేపట్టేందుకు నిధులు మంజూరయ్యాయి. జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలు అన్నింట్లో పనులు చురుగ్గా సాగుతున్నాయి. కాగా, మన ఊరు – మన బడి పథకంలో చేపట్టిన పనుల్లో రాష్ట్రంలోనే జిల్లా ముందంజలో నిలవడం విశేషం.



శాంతినగర్ పాఠశాలలో నిర్మించిన వంటషెడ్

నేడు రెండు పాఠశాలలు ప్రారంభం

ప్రభుత్వ సూచనలతో 32 పాఠశాలలను ప్రారంభించాలని నిర్ణయించగా.. బుధవారం ఖమ్మం నగరంలోని శాంతినగర్, మామిళ్లగూడెం పాఠశాలలను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రారంభించనున్నారు. మిగిలిన పాఠశాలను స్థానిక పరిస్థితులకు అనుగుణంగా అక్కడి ప్రజాప్రతినిధులు ప్రారంభించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా, మంత్రి పువ్వాడ పారంభించనున్న శాంతినగర్, మామిళ్లగూడెం పాఠశాలను కలెక్టర్ గౌతమ్ మంగళవారం రాత్రి పరిశీలించారు. పెయింటింగ్, కిచెన్ షెడ్లు, తరగతి గదులు, డైనింగ్ హాల్, టాయిలెట్లను పరిశీలించి సూచనలు చేశారు. అదనపు కలెక్టర్ స్నేహలత, మున్సిపల్ ఈఈ కృష్ణలాల్, డీఈఈ స్వరూపరాణి, ఎంఈఓ శ్రీనివాస్, హెచ్‌ఎంలు కృష్ణకుమారి, వి.శాంత, సెక్టోరియల్ అధికారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మామిళ్లగూడెం పాఠశాలలో పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

ఏర్పాట్లు పూర్తి చేశాం..



కలెక్టర్ గౌతమ్ ఆదేశాల మేరకు మన ఊరు – మన బడి, మన బస్తీ – మన బడి కింద ఎంపిక చేసిన పాఠశాలల్లో పనులను నిత్యం పర్యవేక్షిస్తున్నాం. ఇప్పటివరకు జిల్లాలో 32 పాఠశాలల్లో అన్ని పనులు పూర్తికాగా, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ శాంతినగర్, మామిళ్లగూడెం పాఠశాలలను బుధవారం ప్రారంభిస్తారు. ఈమేరకు ఏర్పాట్లు పూర్తిచేశాం. **– సోమశేఖరశర్మ, డీఈఓ**





పాఠశాల ప్రహరీపై అందమైన చిత్రాలు

ముగిసిన సర్టిఫికెట్ల పరిశీలన

- హాజరైన 1,515 మంది ఉపాధ్యాయులు
- అభ్యంతరాలపై 391దరఖాస్తులు



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో ఉపాధ్యాయుల పదోన్నతులకు సంబంధించి సర్టిఫికెట్ల పరిశీలన మంగళవారంతో ముగిసింది. నగరంలోని పాత డీఈఓ కార్యాలయంలో మూడు రోజులుగా స్కూల్ అసిస్టెంట్(ఎస్‌ఏ)లుగా పదోన్నతికి అర్హులైన ఎస్జీటీల సర్టిఫికెట్లను పరిశీలించారు. జనవరి 29, 30, 31వ తేదీల్లో పరిశీలన చేపట్టగా, మొత్తంగా 1,515మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. వీరిలో స్థానిక సంస్థల నుంచి 1,408, ప్రభుత్వ పాఠశాలల నుంచి 107 మంది ఉన్నారు.

సీనియారిటీ జాబితా విడుదల

పదోన్నతుల కోసం దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయుల సర్టిఫికెట్లను పరిశీలించిన నేపథ్యాన సీనియారిటీ జాబితా తయారీపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. అయితే, సీనియారిటీ జాబితాలో పేర్లు లేకపోవడం, రోస్టర్ పాయింట్ల నమోదుపై అభ్యంతరాలు తెలుపుతూ అందిన 391 దరఖాస్తులను పరిశీలించాక జాబితా విడుదల చేసే అవకాశముందని తెలిసింది.

కొలువుదీరనున్న మార్కెట్ కమిటీ

- నేడు ఖమ్మం మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం
- హాజరుకానున్న మంత్రులు సింగిరెడ్డి, పువ్వాడ



దోరేపల్లి శ్వేత



షేక్ అఫ్జల్

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు నూతన కమిటీ బుధవారం కొలువుదీరనుంది. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు 1969లో తొలి కమిటీ ఏర్పాటు కాగా, ఇప్పటి వరకు 11మంది చైర్మన్లు బాధ్యతలు నిర్వర్తించారు. తెలంగాణ ఏర్పాటయ్యాక మార్కెట్ కమిటీలకు రిజర్వేషన్లు అమలుచేస్తుండడంతో జనరల్ మహిళ కోటాలో ఖమ్మంకు చెందిన 58వ డివిజన్ కార్పొరేటర్ దోరేపల్లి శ్వేత 12వ చైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు. ఖమ్మం మార్కెట్ చరిత్రలో తొలి మహిళ చైర్‌పర్సన్‌గా డౌలే లక్ష్మీప్రసన్న పనిచేయగా, రెండో మహిళగా శ్వేతకు అవకాశం దక్కింది. బీడీఎస్ పూర్తి చేసిన శ్వేత చైర్‌పర్సన్‌గా, వైస్ చైర్మన్‌గా రఘునాథపాలెం మండలం రాంక్యా తండాకు చెందిన షేక్ అఫ్జల్‌తో పాటు మరో 16 మంది డైరెక్టర్లను ప్రభుత్వం నియమించింది. ఈ కమిటీ రెండేళ్ల పాటు పదవిలో కొనసాగనుంది.

ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు

ఖమ్మం మార్కెట్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు పత్తి మార్కెట్ యార్డులో జరగనుంది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌తో పాటు జిల్లా నేతలు పలువురు హాజరు కానున్నారు. ఈమేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు.

గొడవ చేస్తే లాభం లేదు..

భూవివాదంపై వైరల్‌గా మారిన ఆడియో

సత్తుపల్లి: మండలంలోని గంగారం గ్రామం బేతుపల్లి సర్వే నంబర్ 133/164/4లో ముత్తా వెంకటేశ్వరరావుకు చెందిన రెండు ఎకరాల భూమి అక్రమ రిజిస్ట్రేషన్ వివాదం మలుపులు తిరుగుతోంది. ముత్తా వెంకటేశ్వరరావుకు సంబంధించిన వ్యక్తి, ఆపరేటర్‌గా చెబుతున్న ఇంకొకరి నడుమ జరిగిన ఆడియో సంభాషణ క్లిప్పింగ్ సోషల్ మీడియాలో మంగళవారం వైరల్‌గా మారింది. ఇందులో మిస్సింగ్ నంబర్ కింద పెట్టి అప్రూవల్ చేయడం, అదే జరిగితే అసలు భూములు ఉన్నవాళ్లు ఇబ్బంది పడుతున్నారంటూ ఇద్దరి నడుమ సంభాషణ సాగింది. ఈక్రమంలో గొడవ చేస్తే అన్నీ ఒకరి మెడకే చుట్టుకుంటాయని బదులివ్వగా, దూరం నుంచి వచ్చిన అధికారిని ఇబ్బంది పెట్టొద్దని కోరుతూ రెండు, మూడు నెలల్లో అంతా ఎటో అటు వెళ్లిపోతారని ముక్తాయింపు ఇవ్వడం గమనార్హం. ఈ విషయమై కల్లూరు ఆర్డీఓ సూర్యనారాయణను వివరణ కోరగా బేతుపల్లి రెవెన్యూలో జరిగిన రిజిస్ట్రేషన్ల వ్యవహారం, ఆడియో సంభాషణపై విచారణ చేయిస్తామని తెలిపారు.

నిలిచిన తాగునీటి సరఫరా

వైరా రిజర్వాయర్‌లో నీటిమట్టం తగ్గడమే కారణం



వైరా రిజర్వాయర్‌లో తగ్గిన నీటిమట్టం

వైరా: వేసవి కాలం రాకముందే తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. వైరా రిజర్వాయర్ నుండి బోడేపూడి సుజల స్రవంతి మంచినీటి పథకం ద్వారా మండలంలోని 30 గ్రామాలకు తాగునీరు సరఫరా జరుగుతోంది. గత ఇరవై ఏళ్ల క్రితం ఏర్పాటుచేసిన ఈ పథకం ద్వారా తొలినాళ్లలో పలు మండలాలకు తాగునీరు అందించినా, ఆతర్వాత వైరా మండలానికే పరిమితం చేశారు. ఇప్పుడు వైరా రిజర్వాయర్‌లో నీటిమట్టం రోజురోజుకు తగ్గిపోతుండడం.. అటు సాగునీరు, ఇటు మిషన్ భగీరథ పథకానికి వినియోగిస్తుండడంతో సమస్య ఎదురైంది. గత ఏడాది కూడా ఇదే సమస్య వచ్చినా సిల్ట్ తొలగించి మోటార్లకు నీరు అందేలా ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 12.5 అడుగుల నీరే ఉండటంతో మున్సిపాలిటీ పరిధి వైరా, సోమవరం, గండగలపాడు గ్రామాలతో పాటు, మండలంలోని 23 పంచాయతీల పరిధి తొమ్మిది గ్రామాలకు కూడా తాగునీటి సరఫరా నిలిపేశారు.



లారీలు.. బారులు

రైలు బోగీలను తలపించేలా ఖమ్మం బైపాస్‌లోని ఎఫ్‌సీఐ గోడౌన్ల వద్ద లారీలు నిలిచిపోయాయి. బియ్యంతో వచ్చిన లారీల నుంచి అన్‌లోడింగ్ ఆలస్యమవుతుండడంతో రెండు రోజులుగా ఇలా రోడ్డు పక్కన నిలిపారు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్

పార్టీ నిర్ణయాలకు వ్యతిరేకంగా పనిచేశారు..

ఎమ్మెల్సీ తాత మధుసూదన్

ఖమ్మంమయూరిసెంటర్: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి రాజకీయాల్లోకి వచ్చి జన బలంతో గెలవలేదని, ఆయన గెలుపు యాదృచ్ఛికమేనని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాత మధుసూదన్ అన్నారు. ఆనాటి ఎన్నికల్లో కాంగ్రెస్ గుర్తు లేకపోవడానికి తోడు టీడీపీలో గొడవలు, సీపీఎం మద్దతుతో గెలిచారని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల ఏర్పాటుచేస్తున్న ఆత్మీయ సమ్మేళనాల్లో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి పార్టీ, అధినాయకత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతుండడంతో ఆయన విమర్శలపై స్పష్టత ఇస్తున్నట్లు తెలిపారు. తమ కారణంగానే రాష్ట్రం, జిల్లాలో పార్టీ అభివృద్ధి జరుగుతుందనుకునే వారు స్థాయి కంటే ఎక్కువ ఊహించుకున్నట్లవుతుందని చెప్పారు. అన్ని పార్టీల మాదిరిగానే బీఆర్‌ఎస్‌లో ఉండే నిబంధనలు, క్రమశిక్షణను ఉల్లంఘించి శ్రీనివాసరెడ్డి వ్యవహరిస్తున్నారని తెలిపారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల శంకుస్థాపన, ప్రారంభోత్సవాలకు మంత్రి కేటీఆర్‌తో కలిసి హాజరైన పొంగులేటి ఇప్పుడు అందుకు విరుద్ధంగా మాట్లాడడం సరికాదన్నారు. 2018 తర్వాత జరిగిన ఏ ఎన్నికల్లో కూడా బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపులో పొంగులేటి పాత్ర, కృషి లేదని తెలిపారు. ఈ సమావేశంలో జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, కేఎంసీ, డీసీసీబీ, సుడా చైర్మన్లు పునుకొల్లు నీరజ, కూరాకుల నాగభూషణం, బి.విజయ్, రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు నల్లమల వెంకటేశ్వరరావు, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజుతో పాటు చింతనిప్పు కృష్ణచైతన్య, రాపర్తి శరత్, ఖమర్, ఆశ్రిఫ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్, పక్కన మేయర్ నీరజ, డీసీసీబీ చైర్మన్ నాగభూషణం తదితరులు

పోడు పట్టాల పంపిణీకి ఏర్పాట్లు

- కలెక్టర్ వీ.పీ.గౌతమ్
- కలెక్టరేట్‌లో అటవీ హక్కుల కమిటీ సమావేశం

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో అర్హులైన పోడు రైతులకు పట్టాల పంపిణీకి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. కొత్త కలెక్టరేట్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన జిల్లా స్థాయి అటవీ హక్కుల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పోడు భూముల్లో సాగు చేస్తున్న వారి నుండి దరఖాస్తులు స్వీకరించగా, క్షేత్రస్థాయిలో పకడ్బందీ పరిశీలన చేసినట్లు తెలిపారు. జిల్లాలోని పది మండలాల్లో 94 గ్రామపంచాయతీలు, 132 ఆవాసాల నుండి మొత్తంగా 43,193 ఎకరాల్లో హక్కు పత్రాల కోసం 18,487 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. క్షేత్ర స్థాయిలో సర్వే, విచారణ గ్రామసభల అనంతరం డివిజన్ స్థాయి కమిటీ ద్వారా 4,232.15 ఎకరాలకు పట్టాలు ఇచ్చేందుకు సిఫారసులు అందినట్లు తెలిపారు. ఇంకా ఏమైనా అభ్యంతరాలు ఉంటే పరిశీలించి అర్హులకు న్యాయం జరిగేలా చూస్తామని చెప్పారు. భద్రాచలం ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రు మాట్లాడగా అదనపు కలెక్టర్లు స్నేహలత, ఎస్.మధుసూదన్, జిల్లా అటవీశాఖాధికారి సిద్ధార్థ విక్రమ్‌సింగ్, ఆర్డీఓలు రవీంద్రనాథ్, సూర్యనారాయణతో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రు తదితరులు

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

జిల్లాలోని అధిక ఆదాయం కలిగిన గ్రామపంచాయతీల్లో చేపట్టిన అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. మేజర్ గ్రామపంచాయతీల అభివృద్ధిపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ పది వేలకు పైగా జనాభా ఉన్న పెద్దతండా, ఏదులాపురం, నేలకొండపల్లి, కల్లూరు, కొమ్మినేపల్లి, పాలేరు, తల్లాడ గ్రామాలకు నిధుల కేటాయింపుపై సీఎం కేసీఆర్ హామీ ఇచ్చిన నేపథ్యాన పార్కులు, ట్యాంక్‌బండ్, గ్రంథాలయ భవనాలు, దుకాణ సముదాయాలు, పబ్లిక్ టాయిలెట్లు, కమ్యూనిటీ భవనాలు తదితర అవసరాలకు కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. నేలకొండపల్లిలో భక్త రామదాసు ధ్యాన మందిరం అభివృద్ధి, పాలేరులో పర్యాటక అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అదనపు కలెక్టర్ స్నేహలత, ఇన్‌చార్జ్ డీపీఓ వీ.వీ.అప్పారావు, పీఆర్ ఈఈ కేవీకే.శ్రీనివాస్, డీఎల్పీఓ పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా వ్యాప్తంగా మిషన్ భగీరథ పథకంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యాన ఖమ్మంలోని మిషన్ భగీరథ ఎస్ఈ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీఆర్ఎస్‌కేవీ మిషన్ భగీరథ వర్కర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మద్దెల రవి, సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శులు కళ్యాణం వెంకటేశ్వర్లు, తోట రామాంజనేయులు, జి.రామయ్య మాట్లాడుతూ కార్మికుల పెండింగ్ వేతనాలు, నాలుగేళ్ల బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. నాయకులు జిల్లేపల్లి బాబురావు, కొత్త పుల్లారెడ్డి, సురేంద్ర రెడ్డి, మానుకొండ వెంకటేశ్వర్లు, బాత్తుల కిశోర్, గుండ్ల ముత్తయ్య పాల్గొన్నారు.

నాటుసారా విక్రేతకు జైలు శిక్ష

తిరుమలాయపాలెం: గుడుంబా విక్రయం కేసులో బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించిన వ్యక్తికి తిరుమలాయపాలెం తహసీల్దార్ పుల్లయ్య 218 రోజుల జైలు శిక్ష విధించారు. మహబూబాబాద్ జిల్లా సీరోలు మండలం కొత్తతండాకు చెందిన బానోతు సంతోష్ గతంలో నాటుసారా విక్రయిస్తూ పట్టుబడగా తహసీల్దార్ పుల్లయ్య ఎదుట బైండోవర్ చేశారు. మళ్లీ ఆయన సారా విక్రయిస్తూ పట్టుబడగా రూ.లక్ష జరిమానా విధించడంతో చెల్లించలేదు. దీంతో సంతోష్‌కు 218 రోజుల జైలు శిక్ష విధించగా, ఎక్సైజ్ సీఐ జయశ్రీ, ఎస్సై ప్రసాద్, కానిస్టేబుల్ వీరభద్రం ఆయనను జిల్లా జైలుకు తరలించారు.

రూ.12వేల విలువైన గంజాయి స్వాధీనం

ఖమ్మంరూరల్: మండలంలోని కోదాడ క్రాస్‌రోడ్డు పోలీసులు చేపట్టిన తనిఖీల్లో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రోజువారీగా మంగళవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఖమ్మం రూరల్ మండలం ఆటోనగర్‌కు చెందిన బడుగు కళ్యాణ్, నారపోగు కళ్యాణ్, జలగంనగర్‌కు చెందిన షేక్ ఫయాజ్ అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో వీరిని తనిఖీలు చేయగా రూ.12వేల విలువైన గంజాయి లభ్యమైంది. ఇంకో వ్యక్తి కొనుగోలు చేసి చిన్న ప్యాకెట్లుగా మార్చి యువతకు అమ్మేందుకు వెళ్తున్నట్లు అంగీకరించినట్లు ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు.

విద్యుత్‌చౌర్యం కేసులో రిమాండ్

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం మోతీనగర్‌కు చెందిన కిన్నెర ఉపేందర్‌కు విద్యుత్ చౌర్యం కేసులో మంగళవారం మూడో అదనపు ప్రథమశ్రేణి న్యాయమూర్తి రిమాండ్ విధించారు. విద్యుత్ బకాయి చెల్లించకపోవడంతో ఉపేందర్ ఇంటికి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఈక్రమంలో ఆయన నేరుగా స్తంభంపై తీగలకు వైరు తగిలించి చౌర్యానికి పాల్పడుతుండగా విద్యుత్ అధికారులు కేసు నమోదు చేశారు. విద్యుత్ విజిలెన్స్ సీఐ జె.రాజశేఖర్ విచారణ అనంతరం ఉపేందర్‌ను కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య

పెనుబల్లి : చెట్టుకు ఉరి వేసుకుని ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. పెనుబల్లి మండలం గంగదేవిపాడుకు చెందిన భారత రాధమ్మ(58) కుమారుడు ఏడాది క్రితం ఆత్మహత్య చేసుకోగా, అప్పటి నుంచి ఒంటరిగా జీవిస్తోంది. ఈక్రమంలో మంగళవారం ఇంటి వెనుక ఉన్న జామ చెట్టుకు రాధమ్మ ఉరి వేసుకోగా, స్థానికులు గుర్తించి ఆమె సోదరుడు బన్నె వెంకటేశ్వరరావుకు సమాచారం ఇచ్చారు. ఎవరూ లేరనే ఆవేదనతోనే ఆమె ఆత్మహత్య చేసుకుని ఉంటుందని సోదరుడు చేసిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్సై సూరజ్ తెలిపారు.

ఇంటి నంబర్ కోసం లంచం

ఏసీబీకి పట్టుబడిన పంచాయతీ కార్యదర్శి

ఖమ్మంరూరల్ : కొత్తగా నిర్మించుకున్న ఇంటికి నంబర్‌కు కేటాయించేందుకు లంచం తీసుకుంటూ పంచాయతీ కార్యదర్శి ఏసీబీకి పట్టుబడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం నాయకన్‌గూడెంకు చెందిన డి.నాగేశ్వరరావు ఖమ్మం రూరల్ మండలంలోని ఏదులాపురం పరిధి చంద్రానగర్‌లో కొత్తగా ఇల్లు నిర్మించుకున్నాడు. ఈ ఇంటికి నంబర్ కేటాయించాలని పంచాయతీ కార్యదర్శి సయ్యద్ మహబూబ్‌పాషాను కోరగా.. రూ.20వేలు డిమాండ్ చేశాడు. చివరకు రూ.6వేలకు ఒప్పందం కుదిరింది. ఇందులో భాగంగా మంగళవారం పంచాయతీ కార్యాలయంలో నాగేశ్వరరావు నుండి రూ. 6వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు మహబూబ్‌పాషాను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం డీఎస్పీ సూర్యనారాయణ మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శి ఇంట్లో తనిఖీలు చేశాక, బుధవారం ఆయనను హైదరాబాద్‌లోని ఏసీబీ కోర్టులో హాజరుపర్చనున్నట్లు తెలిపారు.

పంటలను కాపాడండి...



కలెక్టరేట్ ఎదుటధర్నాలో పాల్గొన్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: విద్యుత్ కోతలు ఎత్తివేయడంతో పాటు పగటిపూట నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసి ఎండిపోతున్న పంటలను కాపాడాలని తెలంగాణ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. అలాగే,సమగ్ర పంటల బీమా పథకం అమలు, నష్టపోయిన మిర్చి రైతులకు పరిహారం, సాగర్ జలాలు సరఫరాలో వారబందీ తొలగించాలనే డిమాండ్‌తో నాయకులు మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు మాట్లాడుతూ కరెంట్ కోతలతో పంటలు ఎండిపోతున్నందున ప్రభుత్వం స్పందించాలన్నారు. నాయకులు బొంతు రాంబాబు, నున్నా నాగేశ్వరరావు, మాదినేని రమేష్, భాస్కరరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏసీడీ చార్జీలు ఉపసంహరించుకోవాలి

విద్యుత్ వినియోగదారులపై ఏసీడీ చార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యాన విద్యుత్ ఎస్ఈ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ధర్నా చేస్తున్న నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు ఆవునూరి మధు మాట్లాడుతూ రైతాంగానికి ఉచితంగా 24 గంటల పాటు కరెంట్ ఇవ్వడమే కాక, ఏసీడీ చార్జీలు ఉపసంహరించుకోవాలన్నారు. న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మందుల రాజేంద్రప్రసాద్, పార్టీ, అనుబంధ సంఘాల నాయకులు కోలా లక్ష్మీనారాయణ, బజ్జూరి వెంకటరామిరెడ్డి, వై.ప్రకాష్, జి.రమేష్, శీలం సుదర్శన్, పాముల మోహన్‌రావు, షేక్ సుభాన్, మస్తాన్, ఉపేందర్, గోపి తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ ఘటనపై విచారణ

ఎస్ఓ, ఉపాధ్యాయురాలికి నోటీసులు



విద్యార్థినులతో మాట్లాడుతున్న జీసీడీఓ, డీసీపీఓ

తిరుమలాయపాలెం: మండలంలోని తిరుమలాయపాలెం కస్తూర్బాగాంధీ విద్యాలయంలో విద్యార్థినులు బాత్‌రూమ్ డోర్లపై అసభ్యపదజాలం రాశారని గుంజీలు తీయించడంతో పాటు కొట్టిన ఘటనపై మంగళవారం అధికారులు విచారణ చేపట్టారు. జీసీడీఓ ఉదయశ్రీ, డీసీపీఓ విష్ణువందన, ఎంపీడీఓ జయరాం, ఎంపీపీ మంగీలాల్, సర్పంచ్ కొండబాల వెంకటేశ్వర్లు విద్యార్థినులు, ఉపాధ్యాయురాళ్లతో మాట్లాడి 27వ తేదీన జరిగిన ఘటన వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా పాఠశాల ఎస్ఓ, ఇంగ్లిష్ ఉపాధ్యాయురాలికి షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు జీసీడీఓ తెలిపారు.

పెట్టుబడులతో రండి

పెట్టుబడులకు ఏపీ అత్యంత అనువైన రాష్ట్రం: సీఎం వైఎస్ జగన్ ● సులభతర వాణిజ్యంలో గత మూడేళ్లుగా నంబర్ వన్

- ఎలాంటి అసౌకర్యం కలిగినా ఒక్క ఫోన్‌కాల్ దూరంలో ఉంటాం
- ఢిల్లీలో పారిశ్రామికవేత్తలతో సన్నాహక సదస్సులో సీఎం భరోసా
- మార్చి 3, 4 తేదీల్లో విశాఖలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్



గ్లోబల్ ఇన్వెస్టర్స్ సన్నాహక సదస్సులో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. చిత్రంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి, నాస్కామ్ అధ్యక్షురాలు దేబ్జానీ ఘోష్, అసోచామ్ అధ్యక్షుడు సుమంత్ సిన్హా, భారత్ బయోటెక్ సహ వ్యవస్థాపకురాలు సుచిత్ర ఎల్లా, మంత్రి అమర్‌నాథ్

సాక్షి, న్యూఢిల్లీ: పరిశ్రమల స్థాపనకు అత్యంత అనువైన వాతావరణం ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆహ్వానించారు. పరిశ్రమల ఏర్పాటులో అత్యుత్తమ సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు. మంగళవారం ఢిల్లీలోని లీలా ప్యాలెస్ హోటల్‌లో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సన్నాహక సదస్సులో ముఖ్యమంత్రి జగన్ మాట్లాడారు. వివిధ దేశాల దౌత్యాధికారులు, పరిశ్రమల ప్రతినిధులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన ఉన్నతాధికారులతోపాటు మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్, గుడివాడ అమర్‌నాథ్ సన్నాహక సదస్సుకు హాజరయ్యారు.

అత్యుత్తమ సౌకర్యాలు

'విశాఖపట్నంలో మార్చి 3, 4 తేదీల్లో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ నిర్వహిస్తున్నాం. దీనికి అందరినీ ఆహ్వానిస్తున్నాం. పరిశ్రమల ఏర్పాటులో మీకు అత్యుత్తమ సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇస్తున్నాం. ఏ పారిశ్రామికవేత్తకైనా ఎలాంటి అసౌకర్యం కలిగినా కేవలం ఒక్క ఫోన్ కాల్ దూరంలో అందుబాటులో ఉంటామని కూడా హామీ ఇస్తున్నాం' అని సీఎం జగన్ పేర్కొన్నారు. ప్రారంభోపన్యాసంతో పాటు సదస్సు చివరలో ఏపీలో పెట్టుబడులకు గల సానుకూలతలను సీఎం వివరించారు.

శరవేగంగా అనుమతులు..

☛ పరిశ్రమలకు అనుమతుల విషయంలో రాష్ట్రంలో సింగిల్ డెస్క్ పోర్టల్ విధానం అమలులో ఉందని సీఎం జగన్ తెలిపారు. పరిశ్రమల ఏర్పాటుకు 21 రోజుల్లోనే అనుమతులు మంజూరు చేస్తున్నామని, శరవేగంగా అనుమతులివ్వడం ద్వారా పారిశ్రామికవేత్తల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అత్యంత అనుకూలంగా ఉందన్నారు.

☛ 11.43 శాతం జీఎస్‌డీపీతో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా, అగ్రగామిగా నిలిచింది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో గత మూడేళ్లుగా ఏపీ దేశంలోనే నంబర్‌వన్ స్థానంలో ఉంది. పరిశ్రమల స్థాపనకు మేం చేస్తున్న కృషితో పాటు పారిశ్రామికవేత్తలు ఇచ్చిన ఫీడ్ బ్యాక్‌తోనే నెంబర్‌వన్ స్థానంలో స్థిరంగా కొనసాగుతున్నాం. తద్వారా పరిశ్రమల స్థాపనకు, పారిశ్రామికవేత్తలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎంత అనుకూలంగా ఉందో స్పష్టమవుతోంది.

> “విశాఖపట్నం త్వరలో కార్యనిర్వాహక రాజధాని కాబోతుంది. రానున్న కొద్ది నెలల్లో నేను కూడా విశాఖకు షిఫ్ట్ అవుతున్నా. విశాఖలో నిర్వహించే సదస్సుకు హాజరు కావాలని మీ అందరినీ కోరుతున్నా. మీతో పాటు మీ సహచరులు, ఇతర కంపెనీల ప్రతినిధులను కూడా సదస్సుకు తోడ్కొని వచ్చి ఏపీలో పరిశ్రమల స్థాపన, వ్యాపారం ఎంత సులభతరమో తెలియచేయాలి.
>
> - ముఖ్యమంత్రి వైఎస్ జగన్

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఏప్రిల్ లోపే విశాఖ నుంచి పాలన

- అనేక ప్రభుత్వ భవనాలు అందుబాటులో ఉన్నాయి
- అవసరమనుకుంటే ప్రైవేట్ భవనాలు లీజ్‌కు తీసుకుంటాం
- న్యాయపరమైన చిక్కులు తొలగిన మరుక్షణమే విశాఖ నుంచి పరిపాలన
- నవీన్‌కు సీబీఐ నోటీసులు అవాస్తవం
- మీడియాతో టీటీడీ చైర్మన్, రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



సాక్షి, విశాఖపట్నం: ఏప్రిల్ లోపే విశాఖ నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందించనున్నారని టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి స్పష్టం చేశారు. మూడు రాజధానులను అడ్డుకునేందుకు కొన్ని దుష్టశక్తులు ప్రయత్నిస్తున్నాయని, న్యాయపరమైన చిక్కులు తొలగిన మరుక్షణమే విశాఖ నుంచి పరిపాలన కొనసాగుతుందని చెప్పారు. మంగళవారం సింహాచలంలోని గోశాలలో ఆయన మీడియాతో మాట్లాడారు. విశాఖను పరిపాలన రాజధాని చేయడం ద్వారా దశాబ్దాలుగా వెనుకబడిన ఉత్తరాంధ్ర ప్రాంత అభివృద్ధి చెందుతుందన్నారు. రాజధాని ఏర్పాటుకు భవనాల సమస్య రాదన్నారు. విశాఖలో ఎక్కువగా ప్రభుత్వ కార్యాలయాలున్నాయని, అదేవిధంగా వీఎంఆర్‌డీఏ భవనాలు కూడా చాలా అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అవసరమైతే ప్రైవేట్ భవనాలను కూడా లీజ్‌కి తీసుకుంటామన్నారు. ఐటీ కంపెనీలు లిమిటెడ్‌గానే ఉన్నాయి కాబట్టి ఆ బిల్డింగ్స్‌ను కూడా అవసరమైతే రాజధానికి ఉపయోగించుకుంటామన్నారు. ఎన్నికలకు వెళ్లేలోపు పరిపాలనా వికేంద్రీకరణ అనేది జరిగి తీరుతుందన్నారు. కాగా, ముఖ్యమంత్రి నివాసంలో కీలకంగా ఉండే నవీన్ అనే వ్యక్తితో పాటు పలువురికి సీబీఐ నోటీసులు ఇచ్చిందనేది పూర్తిగా అవాస్తవమని వైవీ సుబ్బారెడ్డి తేల్చి చెప్పారు. సీఎం జగన్ ఇంట్లో గత 12 ఏళ్లుగా నవీన్ అనే వ్యక్తి పనిచేస్తున్నారని తెలిపారు. సీఎం సతీమణి భారతమ్మతో మాట్లాడాలన్నా.. లేదా ఆమె ఆరోగ్య పరిస్థితులు తెలుసుకోవాలన్నా.. తానే కాకుండా తమ కుటుంబ సభ్యులందరూ నవీన్‌కే ఫోన్ చేస్తుంటామని వెల్లడించారు. దాన్ని ఈనాడు రామోజీరావు, ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ ఎందుకు భూతద్దంలో పెట్టి చూపిస్తున్నారో అర్థం కాలేదని మండిపడ్డారు.

సీబీఐ విచారణ చేయాలి..

అవినాశ్‌రెడ్డిని సీబీఐ విచారణ చేస్తున్న సమయంలో గదిలో అధికారులు మాత్రమే ఉంటారని, అలాంటప్పుడు లోపల జరిగిన సంభాషణ, విచారణ ఇదే అంటూ ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలు ఎలా రాశాయన్నారు. లోపల జరిగిన విచారణ విషయాలను ఈ పత్రికలకు ఎవరు చెప్పారని ప్రశ్నించారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం సీబీఐ విచారణ చేయించాలని ఆయన డిమాండ్ చేశారు.

జనవరిలో శ్రీవారి హుండీ ఆదాయం రూ.123 కోట్లు

తిరుమల: జనవరిలో తిరుమల శ్రీవారి హుండీ ఆదాయం రూ.100 కోట్లు దాటింది. జనవరి 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు తిరుమల శ్రీవారికి హుండీలో రూ.123 కోట్లను భక్తులు కానుకల రూపంలో సమర్పించారు. జనవరి 2 తేదీన శ్రీవారికి రూ.7.68 కోట్ల హుండీ ఆదాయం లభించింది. టీటీడీ చరిత్రలోనే ఇది అత్యధిక ఆదాయాల్లో రెండోది. గత ఏడాది నుంచి తిరుమల శ్రీవారి ఆదాయం ప్రతి నెలా రూ.వంద కోట్లు దాటుతుండడం గమనార్హం.

కర్ణాటక సంగీత కళాకారిణి లలిత చంద్రన్ కన్నుమూత

ఆమె బొంబాయి సిస్టర్స్‌లో ఒకరు

తమిళ సినిమా: ప్రఖ్యాత కర్ణాటక సంగీత కళాకారుల ద్వయంలో ఒకరైన లలితా చంద్రన్ (70) మంగళవారం రాత్రి చెన్నైలో గుండెపోటుతో కన్నుమూశారు. ఆమె సోదరి సి.సరోజిని. వీరు కేరళలోని తిరుచ్చూర్‌కు చెందినవారు. తల్లిదండ్రులు ముకుందమ్ భాయ్, చిదంబరం అయ్యర్. తండ్రి ఉద్యోగరీత్యా లలితా చంద్రన్, సరోజిని ముంబైలో పుట్టి పెరిగారు. కర్ణాటక క్లాసికల్ సంగీతంలో ప్రావీణ్యం సాధించడంతో వీరికి బొంబాయి సిస్టర్స్ అనే విశేష గుర్తింపు దక్కింది. తర్వాత వారు చెన్నైలోని అడయార్‌లో స్థిరపడ్డారు. దేశవ్యాప్తంగా కర్ణాటక సంగీత కార్యక్రమాలను నిర్వహించి పేరు గడించారు.

ఏపీలో విద్యారంగం అద్భుతం

- ప్రభుత్వ పాఠశాలల తీరుతెన్నులపై ప్రపంచ ప్రఖ్యాత మోటివేషనల్ స్పీకర్ నిక్ వుజిసిక్ ప్రశంసల జల్లు
- గుంటూరులోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల సందర్శన
- విద్యారంగ పురోగతికి వైఎస్ జగన్ మార్గదర్శకుడు అంటూ ప్రశంస



విద్యార్థినితో మాట్లాడుతున్న నిక్ వుజిసిక్

సాక్షి ప్రతినిధి, గుంటూరు/గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థినులు ఆంగ్లంలో మాట్లాడుతున్న తీరు.. అందులో స్పష్టత, వారు అడుగుతున్న ప్రశ్నలకు అంతర్జాతీయ మోటివేషనల్ స్పీకర్ నిక్ వుజిసిక్ మంత్రముగ్ధులయ్యారు. 'ప్రపంచం మొత్తానికి నేను ప్రేరణగా నిలిచి ఉండవచ్చు.. కానీ, ఈ ప్రాంతం నాకు ఎంతో ప్రేరణనిచ్చింది' అంటూ ఆయన ఫిదా అయ్యారు. గుంటూరు నగరంలోని చౌత్రా సెంటర్‌లో ఉన్న ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలను నిక్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థినులకు లక్ష్యసాధన, దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థినులతో ముఖాముఖిగా మాట్లాడారు. ఆ తర్వాత సాయంత్రం బీఆర్ స్టేడియంలో ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలతో పాటు నగరంలోని వివిధ మున్సిపల్ ఉన్నత పాఠశాలల నుంచి వచ్చిన వేలాది మంది టీన్స్ విద్యార్థులనుద్దేశించి చేసిన ప్రసంగంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో తీసుకువస్తున్న విప్లవాత్మక మార్పులు, చేపడుతున్న కార్యక్రమాలపై మరోమారు ఆయన ప్రశంసల వర్షం కురిపించారు. ఎంతో అంకితభావం ఉన్న ప్రభుత్వం ఈ ప్రాంతంలో ఉండటం అభినందనీయమంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డికి కృతజ్ఞతలు చెబుతున్నానన్నారు. అలాగే, 'నేను ప్రపంచవ్యాప్తంగా 78 దేశాలలో పర్యటించా. కానీ ఏ దేశంలో లేని అనుభూతి, ప్రత్యేకతను నేను గుంటూరులో పొందాను. అది నా అదృష్టంగా భావిస్తున్నా. ప్రపంచంలో ఎంతోమంది నన్ను హీరో అని పిలిచి ఉండవచ్చు.. కానీ, అంతకంటే ఎక్కువ ఆనందాన్ని ఇక్కడ పొందాను. వెలకట్టలేని విద్యకు, విజ్ఞానానికి అధిక ప్రాధాన్యమిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు. ఎంతో మంచి పాలకుడు మీకు ఉన్నారు. అంకితభావం ఉన్న ప్రభుత్వం ఇక్కడ ఉంది. గుంటూరు ప్రాంతం విజ్ఞానం, విద్య పరంగా ఎంతో సామర్థ్యం ఉన్న ప్రాంతం. ప్రపంచవ్యాప్తంగా ఎందరినో కలిశాను. కానీ ఆంధ్రప్రదేశ్ సీఎంతో కలవబోవడం ఎంతో ప్రత్యేకానుభూతిగా ఉంది'.. అంటూ నిక్ తన అనుభూతిని పంచుకున్నారు. ఆయన ప్రసంగంలోని ముఖ్యాంశాలు ఇవీ..

ఇది సామాన్యమైన విషయం కాదు..

ఏపీలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఇంత గొప్పగా మాట్లాడుతారా? ప్రభుత్వ, మున్సిపల్ ఉన్నత పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థినులు తాను మాట్లాడిన ఫారిన్ ఇంగ్లిషు భాషాశైలిని అర్థంచేసుకుని, అంతేస్థాయిలో ఇంగ్లిషులో అనర్గళంగా మాట్లాడిన తీరు అద్భుతం. ఏపీలో ప్రభుత్వ పాఠశాలలు ఇంత గొప్పగా ఉంటాయని నేను ఊహించలేదు. కార్పొరేట్‌ను తలదన్నే రీతిలో ఒక ప్రభుత్వ పాఠశాల సకల హంగులతో ఉండటం ఎంతో ఆశ్చర్యంగా ఉంది. సాధారణ కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థినులను ఇంత గొప్ప ప్రజ్ఞావంతులుగా తీర్చిదిద్దడం సామాన్య విషయం కాదు.

నా జీవితగాథపై పాఠ్యాంశమా!?
జగన్ దేశంలోనే బెస్ట్ సీఎం

రాష్ట్ర ప్రభుత్వం ముద్రించిన 10వ తరగతి ఇంగ్లిషు టెక్ట్స్‌బుక్‌లోని మొదటి పాఠ్యాంశంగా ఉన్న పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌లో 'ఆటిట్యూడ్ ఆల్టిట్యూడ్' పేరుతో నా జీవితగాథను ముద్రించడం ఆశ్చర్యకరం. పాఠ్యాంశంగా నాకు చోటు కల్పించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు. మీ పాఠ్య పుస్తకంలో రాసిన నా జీవితం గురించి చదివారా? (మీ గురించి చదివామని విద్యార్థులు చెప్పగా, ఆయన అంతులేని ఆనందానికి లోనయ్యారు.) ఈ సందర్భంగా ఆయనతో మాట్లాడిన పలువురు విద్యార్థినులు.. నాడు–నేడు ద్వారా సీఎం జగన్ ప్రభుత్వ పాఠశాలలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారని, ఆయన చలువతో అన్ని రకాల వసతులతో చదువుకుంటున్నామని చెప్పారు. ఇక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో విజన్ కలిగిన నాయకునిగా దేశంలోనే బెస్ట్ సీఎంగా నిలిచారని ఈ సందర్భంగా నిక్ వుజిసిక్ అన్నారు.

జిల్లా వార్తలు


జాతీయ స్థాయి పోటీలకు ఖమ్మం అథ్లెట్



గౌతమ్‌ను అభినందిస్తున్న డీవైఎస్‌ఓ, తదితరులు

ఖమ్మంస్పోర్ట్స్: భారత క్రీడా ప్రాధికార సంస్థ (శాయ్) ఆధ్వర్యాన జరగనున్న జాతీయ స్థాయి ఖేలో ఇండియా యూత్ అథ్లెటిక్స్ పోటీలకు ఖమ్మం అథ్లెటిక్స్ అకాడమీకి చెందిన అల్లూరి గౌతమ్ ఎంపికయ్యాడు. స్థానిక కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల విద్యార్థి గౌతమ్ ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌లో జరిగే యూత్ అథ్లెటిక్స్‌లో తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఈ సందర్భంగా విద్యార్థిని డీవైఎస్‌ఓ ఎం.పరంధామరెడ్డి, అథ్లెటిక్స్ అకాడమీ చీఫ్ కోచ్ ఎండీ గౌస్, అథ్లెటిక్స్ అసోసియేషన్ చైర్మన్ నున్నా రాధాకృష్ణ, కార్యదర్శి ఎండీ షఫిక్‌అహ్మద్ అభినందించారు.

కొబ్బరి రైతులకు సబ్సిడీలు



మాట్లాడుతున్న శాస్త్రవేత్త మల్లేశ్

సత్తుపల్లిరూరల్: కొబ్బరి సాగుకు ముందుకొచ్చే రైతులకు కొబ్బరి అభివృద్ధి బోర్డు ద్వారా సబ్సిడీలు అందుతాయని అధికారులు వెల్లడించారు. మండలంలోని గంగారం రైతువేదికలో మంగళవారం ఉద్యానశాఖ, కొబ్బరి అభివృద్ధి బోర్డు ఆధ్వర్యాన రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అశ్వారావుపేట కొబ్బరి పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ మల్లేశ్, ఎం.కిరణ్‌కుమార్ కొబ్బరి తోటల నిర్వహణ, చీడపీడలు, యాజమాన్య పద్ధతులను వివరించారు. అలాగే, కొబ్బరి అభివృద్ధి బోర్డు ద్వారా సబ్సిడీపై మొక్కలు ఇవ్వనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ ఉద్యానవన అధికారి కె.మీనాక్షి మాట్లాడుతూ కొబ్బరి తోటలు వేసిన రైతులు సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సర్పంచ్ మందపాటి శ్రీనివాసరెడ్డి, రైతు సమన్వయ సమితి కన్వీనర్ తిరుమల్‌రావు, ఏఈఓ ఆశాజ్యోతితో పాటు వేంపాటి లక్ష్మీనారాయణ, తుంబూరు ఉమామహేశ్వరరెడ్డి, రామకృష్ణ, నాగబాబు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఎస్‌పీఎల్

- పోటీలను ప్రారంభించిన కేయూ పీడీల సంఘం కార్యదర్శి
- సీనియర్స్ విభాగంలో నేటి నుంచి క్వార్టర్ ఫైనల్స్



క్రికెటర్లను పరిచయం చేసుకుంటున్న ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కాలేజీ పీడీ వెంకన్న (ఇన్‌సెట్) 51 పరుగులు చేసిన మ్యాక్స్ కళాశాల క్రీడాకారుడు హేమంత్



గెలుపొందిన కవిత మెమోరియల్ డిగ్రీ, పీజీ కాలేజీ, కవిత డిగ్రీ, పీజీ కళాశాల జట్లు

ఖమ్మం స్పోర్ట్స్: నగరంలోని ఎస్‌ఆర్‌అండ్ బీజీఎన్‌ఆర్ కళాశాల మైదానంలో 'సాక్షి' మీడియా గ్రూప్ ఆధ్వర్యాన సుధాకర్ పైప్స్ అండ్ ఫిట్టింగ్స్ కంపెనీ సౌజన్యంతో ఏర్పాటుచేసిన 'సాక్షి' ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ హోరాహోరీగా సాగుతోంది. ఈమేరకు మంగళవారం పోటీలను కేయూ పీడీల సంఘం కార్యదర్శి, ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాల పీడీ బి.వెంకన్న ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 'సాక్షి' మీడియా ఆధ్వర్యాన క్రికెట్ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు పోటీలు నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. ఈకార్యక్రమంలో సాక్షి బ్రాంచ్ మేనేజర్ గుడిమెట్ల మోహన్‌కృష్ణ, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ రాధారపు రాజుతో పాటు ఉద్యోగులు నెల్లూరి ఉపేందర్, బోడపట్ల వేణు, జుజ్జూరు ఉపేందర్, రాంబాబు, ఆసిఫ్, కిరణ్, సీనియర్ క్రికెటర్లు జోజిచాకో, ఎం.డీ.ఫారూఖ్, రామకృష్ణ, నాగరాజు, అంపైర్లు సమీర్, సాయిచంద్, మధు, భరత్, ఫరీద్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

పోటీలు.. విజేతలు..

- కవిత మెమోరియల్ డిగ్రీ, పీజీ కళాశాల – మమత నర్సింగ్ కళాశాల జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కవిత జట్టు 107 పరుగులు చేసింది. జట్టులో దేవన్ ఎనిమిది ఫోర్లతో 38, అజయ్‌పుష్కర్ నాలుగు ఫోర్లు, ఒక సిక్సర్‌తో 32 రన్స్ చేశారు. ఆతర్వాత మమత నర్సింగ్ కళాశాల జట్టు 35 పరుగులకే ఆలౌట్ అయింది. కేఎండీసీ బౌలర్లు అరవింద్, భరత్ కళ్యాణ్ మూడేసి వికెట్లు తీసుకోవడంతో విజయం సొంతమైంది.
- కవిత డిగ్రీ, పీజీ కళాశాల – కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల జట్ల మ్యాచ్‌లో కవిత జట్టు 84 పరుగులు చేసింది. జట్టులో ఉమేష్ 28, గౌతమ్ 11, జాహిద్ 16 రన్స్ చేశారు. అనంతరం కిట్స్ జట్టు 66 పరుగులే చేయడంతో ఓటమి పాలైంది.

- వికాస్ డిగ్రీ కళాశాల – యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల జట్ల నడుమ మ్యాచ్‌లో యూసీపీఈ జట్టు 61 పరుగులు చేసింది. ఈ జట్టులో శ్రీను 20 రన్స్ చేశారు. అనంతరం వికాస్ జట్టు ఏడు వికెట్లు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించింది. ఈ జట్టులో పవన్ 24 పరుగులు చేశాడు.
- బ్రౌన్స్ ఫార్మసీ కళాశాల – మ్యాక్స్ ఫార్మసీ కళాశాల మధ్య మ్యాచ్‌లో తొలుత మ్యాక్స్ జట్టు 82 పరుగులు చేసింది. జట్టులో హేమంత్ ఆరు ఫోర్లతో 51 పరుగులు చేయడం విశేషం. ఆతర్వాత బ్రౌన్ జట్టు చివరి బంతి వరకు హోరాహోరీగా పోరాడి ఘన విజయం సాధించింది. ఈ జట్టులో పవన్ 30 పరుగులు చేశాడు.
- ఎస్‌బీఐటీ–1 – గాయత్రి డిగ్రీ కళాశాల జట్ల నడుమ మ్యాచ్‌లో ఎస్‌బీఐటీ–1 జట్టు పరిమిత ఓవర్లలో 82 పరుగులు చేసింది. జట్టులో కళ్యాణ్ 24, మహిమరాజ్ 18, నవీన్ 19 పరుగులు చేశారు. అనంతరం గాయత్రి జట్టు 67 పరుగులు మాత్రమే చేసింది. దీంతో ఎస్‌బీఐటీ–1 కళాశాల జట్టు రెండో రౌండ్‌లోకి ప్రవేశించింది.

- బొమ్మ ఇంజనీరింగ్ కళాశాల – ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్–2 జట్ల నడుమ మ్యాచ్‌లో బ్యాటింగ్ చేసిన బొమ్మ జట్టు 76 పరుగులు చేసింది. జట్టులో మహేష్ 24, ఉదయ్ 19 రన్స్ చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్–2 నిర్ణీత ఓవర్లలో 59 పరుగులు చేసి ఓటమి పాలైంది. కాగా, సీనియర్స్ విభాగంలో బుధవారం నుంచి క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు జరుగుతాయని నిర్వాహకులు వెల్లడించారు.

గురుకులాల్లో డిగ్రీ, ఇంటర్ ప్రవేశాలు

భద్రాచలం: వచ్చే విద్యాసంవత్సరం గిరిజన గురుకుల డిగ్రీ కళాశాలల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రు వెల్లడించారు. మణుగూరు, భద్రాచలం (పురుషులు), కొత్తగూడెం(మహిళలు), దమ్మపేట పెద్దవాగు ప్రాజెక్ట్ (మహిళలు), ఖమ్మం (మహిళలు) కళాశాలల్లో ప్రవేశాలకు ప్రస్తుతం ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతూ, తల్లిదండ్రుల వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల్లోనైతే రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లోనైతే రూ.2 లక్షలలోపు ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హతలు ఉన్న వారు ఈ నెల 5 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇక ఉమ్మడి జిల్లాలోని ఖమ్మం, దమ్మపేట, కిన్నెరసాని, భద్రాచలంలో ఉన్న ప్రతిభ జూనియర్ కళాశాలల్లో ఇంటర్‌లో ప్రవేశాలకు గిరిజన విద్యార్థినీ, విద్యార్థులు ఈ నెల 16 లోగా దరఖాస్తు చేసుకోవాలని పీఓ పేర్కొన్నారు. కాగా, ప్రవేశాలకు సంబంధించి ప్రచార పోస్టర్లను ఖమ్మంలో మంగళవారం కలెక్టర్ గౌతమ్, ప్రిన్సిపాళ్లతో కలిసి పీఓ గౌతమ్ పోట్రు ఆవిష్కరించారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఖమ్మం కలెక్టర్ గౌతమ్, ఐటీడీఏ పీఓ గౌతమ్ తదితరులు

కొత్తగూడెం ఏరియాలో 101 శాతం బొగ్గు ఉత్పత్తి

- ఈనెల 15వ తేదీ నుంచి జీకేఓసీలో మిగిలిన బొగ్గు తవ్వకాలు
- ఏరియాలో 484 క్వార్టర్ల నిర్మాణానికి నిధుల మంజూరు
- ఏరియా జనరల్ మేనేజర్ జక్కం రమేశ్



వివరాలు వెల్లడిస్తున్న జీఎం రమేశ్, పక్కన అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ పరిధి కొత్తగూడెం ఏరియాలో జనవరి నెలకు నిర్దేశించిన 13.71 లక్షల టన్నుల ఉత్పత్తికి గాను 13.78 లక్షల టన్నులు (101 శాతం) ఉత్పత్తి నమోదైందని ఏరియా జనరల్ మేనేజర్ జక్కం రమేశ్ వెల్లడించారు. కొత్తగూడెంలోని కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. గత పది మాసాల ఉత్పత్తి లక్ష్యం 113.13 లక్షల టన్నులకు గాను 101.51 లక్షల టన్నులు ఉత్పత్తి (90 శాతం) సాధించినట్లు తెలిపారు. అలాగే, ఈ ఆర్థిక సంవత్సరం ఇప్పటి వరకు 2,103 రేక్‌లు, జనవరిలో 322 రేక్‌ల బొగ్గు రవాణా జరిగిందని చెప్పారు. ఇక జేవీఆర్‌ఓసీ–2లో 9.40 లక్షల టన్నుల లక్ష్యానికి గాను 11.91 లక్షల టన్నులు (127 శాతం), కిష్టారం ఓసీలో 1.90 లక్షల టన్నుల లక్ష్యానికి 1.69 లక్షల టన్నులు, పీవీకే–5 షాఫ్ట్ గనిలో 41 వేల టన్నుల లక్ష్యానికి 18 వేల టన్నులు ఉత్పత్తి చేసినట్లు వెల్లడించారు. అయితే, జీకేఓసీలో మిగిలిన 1.50 లక్షల టన్నుల బొగ్గు తవ్వకాన్ని ఈ నెల 15 నుంచి ప్రారంభించి నెలాఖరుకు పూర్తిచేస్తామని వివరించారు. కాగా, కొత్తగూడెం ఏరియాలో 484 క్వార్టర్ల నిర్మాణానికి రూ.265 కోట్లను యాజమాన్యం కేటాయించిందని జీఎం తెలిపారు. అందులో పాలలచ్చమ్మ గ్రౌండ్ వద్ద జామాయిల్ తోటలో 210, సత్తుపల్లిలో 81, రెస్క్యూ స్టేషన్ సమీపాన 60, బంగ్లోస్‌లో 84 అధికారుల క్వార్టర్లు నిర్మించి, మిగిలినవి కార్పొరేట్ ఏరియాలో నిర్మించనున్నట్లు చెప్పారు. సమావేశంలో అధికారులు ఆర్.నారాయణరావు, రఘురామిరెడ్డి, బి.రవీందర్, సూర్యనారాయణ, శామ్యూల్ సుధాకర్, యోహాన్, రమణారెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌టీపీ సమావేశం

ఖమ్మంమయూరిసెంటర్: వైఎస్సార్ తెలంగాణ పార్టీ ఉమ్మడి జిల్లా విస్తృతస్థాయి సమావేశాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. ఖానాపురం హవేలీలోని కొలిపాక ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు లక్కినేని సుధీర్‌బాబు తెలిపారు. సమావేశానికి అసెంబ్లీ నియోజకవర్గాల కోఆర్డినేటర్లు, జిల్లా అధికార ప్రతినిధులు, అనుబంధ సంఘాలు, మండలాలు, డివిజన్లు పట్టణాల అధ్యక్షులు హాజరుకావాలని సూచించారు.

బ్యాక్టీరియాతో మొక్కజొన్నలో కాండం కుళ్లు తెగులు

బోనకల్: మొక్కజొన్నలో బ్యాక్టీరియా కారణంగా కాండం కుళ్లు తెగులు ఆశిస్తోందని వైరా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు హేమంత్‌కుమార్, రవికుమార్ వెల్లడించారు. బోనకల్ మండలం ముష్టికుంట్ల గ్రామంలో తెగులు సోకిన మొక్కజొన్న పంటలను వారు మంగళవారం పరిశీలించి నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఎర్వీనియా క్రైసోందమ్ జియో అనే బ్యాక్టీరియా ద్వారా ఈ తెగులు వ్యాప్తి చెందుతోందని చెప్పారు. పైరు తొలి దశలో ఆశించిన తెగులు కారణంగా కణువుకు దగ్గరగా ఆకు తొడిమ, కాండం రంగును కోల్పోయి మచ్చలు ఏర్పడడంతో పాటు మొక్క పైభాగం, ఆకులు ఎండిపోతాయని పేర్కొన్నారు. తెగులు సోకిన మొక్కజొన్న పైభాగం, కణుపుభాగం కుళ్లిపోవడమే కాక, చీల్చి చూస్తే కుళ్లిపోయిన కోడిగుడ్డు వాసన వస్తుందన్నారు. కాగా, నిలిచిన మురుగు నీరు లేదా డ్రెయినేజీ నీటిని పంటకు వాడొద్దని సూచించారు. తెగులు సోకిన సమయంలో తాత్కాలికంగా నత్రజని సంబంధిత యూరియా ఎరువు వాడకం ఆపేసి, 33 శాతం క్లోరిన్ కలిగిన బ్లీచింగ్ పౌడర్‌ను ఎకరాకు నాలుగు కిలోల చొప్పున ద్రావణం రూపంలో మొక్క మొదళ్లు తడిచేలా పిచికారీ చేయాలని శాస్త్రవేత్తలు తెలిపారు. కార్యక్రమంలో ఏఓ శరత్‌బాబు, రైతులు ఇబ్రహీం, నాగేశ్వరరావు, రంగయ్య, రఫీ, లాలయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



తెగులు సోకిన మొక్కజొన్నచేనులో పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు